క్లుప్తంగా

చందన అలంకారంలో రాజరాజేశ్వరి



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో ఆషాఢమాస మూడవ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి విశేషంగా చందనం, గజమాలలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకరబాలాజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాకంబరిదేవిగా అమ్మవారు



చాపాడు : అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో శుక్రవారం భద్రకాళీ మాత శాకంబరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసంలో అన్ని రకాలైన కూరగాయలతో అమ్మవారిని శాకంబరి దేవి అలంకారంలో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు.

మైదుకూరు : మైదుకూరులోని శ్రీపార్వతి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పార్వతిదేవిని శాకంబరి దేవిగా అలంకారం చేశారు. భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముగిసిన ఉరుసు



దర్గాలోకి పూలచాదర్ తీసుకువస్తున్న స్వామి వారసులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దర్గా వీధిలో హుసేన్ పీర్ దర్గా 199వ ఉరుసు మహోత్సవాలు శుక్రవారం నిర్వహించిన తహలిల్ ఫాతిహతో ముగిసాయి. ఇందులో భాగంగా సాయంత్రం స్వామి వారసులు స్వామి సమాధికి పూలచాదర్ సమర్పించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వామి వారసులతోపాటు శిష్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి వారసులు సయ్యద్ మహమ్మద్ కరిముల్లా హుస్సేన్‌షా ఖాదిరి, దర్గారహమతుల్లా, దర్గామున్వర్, దర్గాషఫివుల్లా, దర్గాసలీం, అఫ్తాబ్‌హుస్సేన్, ఆర్గనైజర్లు అన్వర్‌బాషా, షరీఫ్, అంజాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

రాజుపాళెం : రాజుపాళెం తహసీల్దార్ విజయశ్రీని రెవెన్యూ అధికారులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన బదిలీల్లో భాగంగా కర్నూలు జిల్లా నుంచి రాజుపాళెం మండలానికి తహసీల్దార్ విజయశ్రీ వచ్చారు. అయితే తిరిగి యథాస్థానాలకు వెళ్లాలని ఉత్తర్వులు రావడంతో విజయశ్రీ కర్నూలుకు వెళుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఆమెకు శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి ఆర్ఐ అశోక్, సర్వేయర్ గురుశేఖర్‌రెడ్డి, వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రస్తుతం రాజుపాళెం మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీగా ఉన్న మనోహర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

కేసీ కెనాల్, తెలుగుగంగకు నీరు ఇవ్వండి

ఖాజీపేట : శ్రీశైలం జలాశయంలో 860 అడుగులకు నీరు చేరినందున తక్షణమే కేసీ కెనాల్‌కు, తెలుగుగంగకు నీరు ఇవ్వాలని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఇరిగేషన్ అధికారులను డిమాండ్ చేశారు. దుంపలగట్టు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీ కెనాల్, తెలుగుగంగ జలాశయాలకు నీరు నింపేందుకు వెలుగోడుకు వదలాలని అన్నారు. శ్రీశైలం జలాశయంలో 841 అడుగులకు నీరు వచ్చిన వెంటనే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు విడుదల చేసే వీలు ఉందని అన్నారు. ప్రస్తుతం వెలుగోడు జలాశయంలో నీరు డెడ్ స్టోరేజ్‌లో ఉందని అన్నారు. అక్కడ నీరు నింపి తెలుగు గంగలో భాగమైన ఎస్సార్ -1, ఎస్సార్ -2తో పాటు బ్రహ్మంసాగర్ జలాశయం నింపాలని అన్నారు. దీనిపై వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఖాళీ స్థలాలు.. అసౌకర్యాల నిలయాలు

- చెత్తా చెదారంతో మురికి కూపంగా..
- సర్పాలు, విషపురుగులు, దోమలకు ఆవాసం
- భయాందోళనకు గురవుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



బద్వేలులోని గాంధీనగర్ ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు

బద్వేలు(వ్యవసాయం) : బద్వేలు పట్టణంలో నివాసాల నడుమ ఉన్న ఖాళీ స్థలాలు ఏళ్ల తరబడి వినియోగంలో లేకపోవడంతో పిచ్చి మొక్కలు, చెత్త కుప్పలు, కంపచెట్లకు నిలయంగా మారాయి. వీటిలో సర్పాలు, విష పురుగులు, దోమలు స్థావరాలు ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో సమీపంలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దోమల కాటుతో ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఖాళీ స్థలాలపై విస్తీర్ణాన్ని బట్టి పన్నులు వసూళ్లు చేయాల్సిన మున్సిపల్ అధికారులు రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఒత్తిడి కారణంగా అటువైపు కన్నెత్తి చూడలేక పోతున్నారు.

మురుగునీరు చేరి.. దుర్గంధ భరితం..

బద్వేలు పట్టణంలో 500కు పైగా ఖాళీస్థలాలు ఉన్నాయని అంచనా. అలాగే బద్వేలు నియోజకవర్గంలోని పోరుమామిళ్ల, కలసపాడు మండల కేంద్రాల్లో కూడా మరో 300కు పైగా ఖాళీస్థలాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. స్థలాలు పల్లంగా ఉండటం వల్ల సమీపంలోని మురుగునీరు, వర్షపు నీరు చేరి దుర్గంధ భరితంగా మారుతున్నాయి. దీంతో ప్రజలు తరచూ ఖాళీ స్థలాల యజమానులపై చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకుంటున్నా వారు పట్టించుకోవడం లేదు.

వ్యాధుల వ్యాప్తి

పట్టణంలో తెలుగుగంగ కాలనీ, గాంధీనగర్, యన్‌జీఓ కాలనీ, సిద్దవటం రోడ్డు, మార్కెట్ యార్డు, సుందరయ్య కాలనీ, కృష్ణదేవరాయ నగర్, కుమ్మరి కొట్టాలు, గుంతపల్లె రోడ్డు, పాత బద్వేల్ తదితర ప్రాంతాల్లో రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎకరాల కొద్దీ స్థలాలు కొనుగోలు చేశారు. ఈ స్థలాల్లో పేరుకు పోయిన చెత్తకుప్పలు, ముళ్ల కంపను తొలగించాలని యజమానులకు మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు నోటీసులు జారీ చేసి హెచ్చరించాల్సి ఉంది. అయితే వారు పట్టించుకోవడం లేదు. ప్రమాదకర వ్యాధులైన డెంగీ, చికున్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రమాదకర వ్యాధులు మురికినీరు, చెత్తకుప్పల వల్ల వ్యాపిస్తున్నాయి. వర్షాకాలంలో సమీపంలో నివాసం ఉన్నవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. పాములు, పందికొక్కులు బయటికి వచ్చి ప్రజలను కరుస్తున్నాయి.

ఆదాయానికి గండిపడుతున్నా..

ఖాళీ స్థలాలను ఏళ్ల తరబడి అలాగే ఉంచితే మున్సిపల్ అధికారులు వాటి యజమానులపై చర్యలు తీసుకోవచ్చు. స్థలం విస్తీర్ణాన్ని లెక్కించి ఏటా ఆస్తి పన్ను వసూలు చేయాలి. ఇలా చేస్తే బద్వేలు మున్సిపాలిటీకి రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల ఆదాయం ఖజానాకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కలసపాడు, పోరుమామిళ్ల పంచాయతీల్లో ఉన్న ఖాళీ స్థలాలకు ఆస్తిపన్ను జమ కడితే ఏడాదికి రూ.50 లక్షల వస్తుందని అంచనా.

గాంధీనగర్ కాలనీలో..

గాంధీనగర్ కాలనీలో ఉన్న దాదాపు పది వీధుల్లోని ఖాళీ స్థలాల్లో కంపచెట్ల నుంచి రాత్రిపూట పాములు ఇళ్ల దగ్గరకు వస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో గాలివాన మొదలైన వెంటనే కరెంట్ సరఫరా నిలిపి వేస్తుండటంతో ఇంట్లో నుంచి అడుగు బయట పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్నోసార్లు సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయంలో విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

డంప్ యార్డుగా మారుతున్నాయి



ఇళ్లలోని చెత్తంతా వేస్తున్నారు. మా ఇంటికి ఎదురుగా ఉండే ఖాళీ స్థలంలో చుట్టు పక్కల వారందరూ చెత్తా చెదారం వేసి డంప్ యార్డు మాదిరిగా తయారు చేశారు. వర్షాకాలంలో తడిసినప్పుడు భరించలేని దుర్గంధం వస్తోంది. పంచాయతీ అధికారులు ఈ చెత్త కుప్పల గురించి పట్టించుకోవడం లేదు.
–అవధానం పద్మనాభశర్మ, ఏపీఎస్ స్ట్రీట్, కలసపాడు

ఏళ్ల తరబడి ఇంతే..



ఇళ్లు ఉంటే పాములు, పురుగులు బెడద ఉండదు. ఖాళీ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం జరిగి ఉంటే పాములు, పురుగులు, దోమల బెడద ఉండేది కాదు. అయితే ఏళ్ల తరబడి ఇళ్ల మధ్యన ఉన్న స్థలాల్లో పిచ్చి మొక్కలు, కంప చెట్లు తొలగించడం లేదు. అందువల్ల విషపురుగులు చేరుతున్నాయి. – కె.సి.రామారావు, మెయిన్ రోడ్డు, కలసపాడు

పాములు, విషపురుగుల బెడద

రాత్రిపూట పాములు, విషపురుగుల బెడద ఎక్కువైంది. మా వీధిలో ఉండే మురుగు కాలువలో కూడా పాములు ఉన్నాయి. ఇటీవల రాత్రి పది గంటలప్పుడు దారిన పోయేవారు రోడ్డుపైన కట్లపామును చూసి ఇటుక పెళ్లలతో కొట్టి చంపారు. కరెంట్ లేకపోతే ఇంట్లో నుంచి అడుగు బయట పెట్టాలంటేనే భయం వేస్తోంది. ఖాళీ స్థలాల యజమానులపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి ఉండదు.
–జయరామిరెడ్డి, గాంధీనగర్, బద్వేలు

చర్యలు తీసుకుంటాం

బద్వేలు పట్టణంలో ఒక్కొక్క స్థలం పది మంది చేతులు మారింది. స్థలం యజమాని ఎవరైంది ఆ వీధిలోకి వచ్చి అడిగినా చెప్పడం లేదు. ఆ స్థలాల యజమానులను గుర్తించి నోటీసులు పంపిస్తాం. అలాగే ప్రజలు కూడా ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం మానుకొని మున్సిపల్ చెత్త బండ్లలో వేయాలి. అప్పుడు కొంత వరకైనా పరిశుభ్రంగా ఉంటుంది. ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి చర్యలు తీసుకుంటాం.
–యం.క్రిష్ణ, మున్సిపల్ కమిషనర్, బద్వేలు మున్సిపాలిటీ

అమరవీరుల త్యాగం చిరస్మరణీయం



పోరుమామిళ్లలో మాజీ సైనికుల బైక్ ర్యాలీ

పోరుమామిళ్ల : అమరవీరుల త్యాగం చిరస్మరణీయమని మాజీ సైనికోద్యోగుల సంఘం అధ్యక్షుడు కెప్టెన్ సవరం రాముడు, గౌరవ అధ్యక్షుడు కెప్టెన్ వెంకటయ్య తెలిపారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లయిన సందర్భంగా శుక్రవారం పోరుమామిళ్లలో మాజీ సైనికులు కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి మాజీ సైనికుల కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళి అర్పించారు. మహిళలు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మాజీ సైనికులను శాలువాలతో సత్కరించారు. రెడ్డినగర్ మహిళల కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో విశ్రాంత సైనికాధికారులు జగన్‌రెడ్డి, మాథ్యూస్ అబ్రహాం, రఘురామయ్య, మాజీ సైనికులు రుద్రవరం శ్రీనివాసులు, రామసుబ్బయ్య, నాగరాజు, మాజీ సైనికుల సతీమణులు పాల్గొన్నారు.

దేశరక్షణకు నడుం బిగించాలి

బద్వేలు అర్బన్ : అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో విద్యార్థులు దేశరక్షణకు నడుం బిగించాలని రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.వెంకటసాయికృష్ణ పేర్కొన్నారు. స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు మాజీ సైనిక ఉద్యోగులతో కలిసి నివాళులర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారన్నారు. జూలై 26న భారత్‌సైన్యం పాక్ సైన్యాన్ని తరిమికొట్టి పాక్ ఆక్రమిత భూభాగాన్ని స్వాధీనం చేసుకుందని పేర్కొన్నారు. తొలుత పట్టణంలో ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్‌సీసీ ఏఎన్‌ఓలు బాలఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కలసపాడు : స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి మూడు రోడ్ల కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగి డేవిడ్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల నుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల కరస్పాండెంట్ ఆరకటవేముల హరినారాయణ ప్రారంభించారు. కార్గిల్ అమరవీరులకు ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ పర్లపాడు గౌరీశంకర్, ఏఓ సలీం, ప్రిన్సిపాల్ ముస్తఫా, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ దావీద్, విద్యార్థులు పాల్గొన్నారు.

28న రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మైదుకూరు : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 28న ఆదివారం ఉదయం 10 గంటలకు కడపలో జరిగే రాష్ట్ర స్థాయి విద్యా సదస్సును జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు వై.రవి కుమార్ కోరారు. మండలంలోని వనిపెంట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా రాష్ట్రమంతటా స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ స్వర్ణోత్సవాల్లో భాగంగా వివిధ జిల్లాల్లో సమకాలీన అంశాలపై రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహించి ఉపాధ్యాయులను చైతన్య పరచడం జరుగుతున్నదని పేర్కొన్నారు. 28వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు కడపలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ సుధాకర్‌బాబు, యూటీఎఫ్ మండల నాయకులు అనిల్ కుమార్, వనమాల రాము, ఉపాధ్యాయులు మునీర్ అహ్మద్, విజయ కుమార్, గురివిరెడ్డి, నరసింహామూర్తి, హుస్సేన్ పీరా, మారెళ్ల సురేష్, వెంకటరమణ, ముబారక్ ఆలీ, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

పోరుమామిళ్ల : యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న రాష్ట్ర స్థాయి విద్యాసదస్సును జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య కోరారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వివిధ జిల్లాల్లో రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహించి, సమకాలీన అంశాలపై ఉపాధ్యాయులను చైతన్య పరుస్తామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ఈశ్వర్‌రావు, శ్రీనివాసులు, క్రిష్ణయ్య, నాయబ్‌రసూల్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరు : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. స్థానిక శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ అడిక్ట్, యాంటి ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ చాలా మంది మహిళలు సోషల్ మీడియా ప్రభావం వల్ల లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. ఇటీవల కాలంలో అనేక సంఘటనలు జరిగాయని తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసు శాఖ ప్రత్యేకంగా సైబర్ క్రైం విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. చాలా మంది మొబైల్ ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్‌లు, యాప్‌ల ద్వారా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైం జిల్లా సీఐ ఎల్.జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ కె.రమణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఇందిరా, డాక్టర్ జ్యోతి, డాక్టర్ పాండురంగారెడ్డి, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై అప్రమత్తత అవసరం

మైదుకూరు : సోషల్ మీడియా పట్ల విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాలలో సోషల్ మీడియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియాలో భాగమైన ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల్లో వ్యక్తుల పరిచయాలతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా తాము తయారు చేసిన ఫ్లవర్ వాజులు, జ్ఞాపికలను కస్తూరిబా విద్యార్థినులు డీఎస్పీ, ఇతర అధికారులను అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ ఏపీ మస్తాన్, కస్తూరిబా ప్రిన్సిపాల్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం పోష్ చట్టం



అట్లూరు : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి

మైదుకూరు : పనిచేసే ప్రదేశంలో మహిళల రక్షణ ఆయా యాజమాన్యాలదేనని ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో పోష్ యాక్ట్ 2013పై పలు రంగాలకు చెందిన మహిళలకు అవగాహన కలిస్తూ, శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయడానికి ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కంప్లెయింట్ కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. వీటి ద్వారా మహిళలు న్యాయం పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి, మైదుకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మస్తాన్, గవర్నమెంట్ డాక్టర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు : మహిళలు పోష్ చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.శ్రీదేవి పేర్కొన్నారు. అట్లూరు ఎంపీడీఓ కార్యాలయ భవనంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశంలో లైంగిక వేధింపులు ఎదుర్కొనే మహిళలు పోష్ యాక్ట్ కింద నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ చట్టం ద్వారా ఫిర్యాదు చేయడం వల్ల బాధిత మహిళ లేదా ప్రతివాదిని వేరే ప్రదేశానికి బదిలీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయమ్మ, ఎంపీడీఓ అమానుల్లా, ఎంఈఓ విలియంరాజు, ఏఓ భాస్కర్‌బాబు, సీహెచ్‌ఓ మురళీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



ఐడీపీఎస్ విద్యార్థులతో ప్రొద్దుటూరు డీఎస్పీ డి.మురళీధర్

చాపాడు : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ప్రొద్దుటూరు డీఎస్పీ డి.మురళీధర్ అన్నారు. స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం నాయకత్వపు లక్షణాలపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించి పలు విభాగాలకు నాయకులుగా నియమించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు వారి ఉపాధ్యాయులు చెప్పిన ప్రతి విషయాన్ని చక్కగా విని, నిజ జీవితంలో ఆచరిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు.

కార్గిల్ వీరులకు ఘన నివాళి

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం కార్గిల్ విజయ్ దివాస్ పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు భారత వీర సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుద్ధ వీరుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇదే క్రమంలో సైనికుల మాదిరే దుస్తులు ధరించిన విద్యార్థులచే పలు రకాలైన యుద్ధ విన్యాసాలపై అవగాహన కల్పించారు.

పండ్ల తోటలతో లాభదాయకం



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధి అసిస్టెంటు ప్రాజెక్టు డైరెక్టర్ కె.జుబేదా

బ్రహ్మంగారిమఠం : రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని ఉపాధి హామీ పథకం అసిస్టెంటు ప్రాజెక్టు డైరెక్టర్ కె.జుబేదా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు, పొలం గట్ల వెంట మొక్కల పెంపకంపై అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీపీ మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకం వల్ల రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఇదే క్రమంలో గట్ల వెంట చెట్లను పెంచటం వల్ల గట్లు గట్టిగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాళెం : పండ్ల తోటల పెంపకానికి చిన్న, సన్నకారు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జమ్మలమడుగు ఏపీడీ రామలింగేశ్వరరెడ్డి తెలిపారు. రాజుపాళెంలోని ఇందిరాక్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం మండలంలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకాన్ని సన్న, చిన్నకారు రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఆ తర్వాత అందుకు సంబంధించి అంచనాలు తయారు చేసి మంజూరు కోసం పంపాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మినారాయణ, ఈసీ కరుణాదేవి, ప్లానిటేషన్ సూపర్‌వైజర్ లక్షుమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరం పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు : ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నెహ్రూ యువ కేంద్రం, జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న రక్తవారోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో సకాలంలో రక్తం అందక చాలా మంది మృత్యుబాట పడుతున్నారన్నారు. ఈ శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు చిప్పగిరి వెంకటప్రసాద్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ మణికంఠ, వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు శూలం లక్ష్మీదేవి, ప్రసాద్, మదర్ థెరిసా సేవా సమితి చైర్మన్ విజయ్‌కుమార్, జేబీవీఎస్ వ్యవస్థాపకుడు అశోక్, ఎస్‌సీటీ చైర్మన్ సురేంద్ర, నెల్సన్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

ప్రొద్దుటూరు : సేంద్రియ వ్యవసాయంపై శుక్రవారం రైతులకు సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రోగ్రాం ఆఫీసర్లు రవితేజ, జనార్దన్ అవగాహన కల్పించారు. మండలంలోని కల్లూరు, దేగుళ్లపల్లెలో సుస్థిర వ్యవసాయ కేంద్రం, ప్రొద్దుటూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, ఏజే బయో ఫర్టిలైజర్స్ వారి ఆధ్వర్యంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న వరి, వేరుశనగ, మిరప, టమాట పంటలను పరిశీలించారు. అనంతపురం జిల్లా కొత్తచెరువు మండలం, కళ్యాణదుర్గం మండలం నుంచి సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్ సంస్థ నుంచి వచ్చిన రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న ఇక్కడి రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాచురల్ ఫార్మింగ్ కోఆర్డినేటర్ నాగవేణి, ఏజే బయో ఫర్టిలైజర్స్ అభిషేకం, రైతు సంఘం సీఈఓ పవన్‌కుమార్, కల్లూరు మాజీ సర్పంచ్ కల్లూరు నాగేంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ నుంచి మినహాయించాలి

చాపాడు : వ్యాక్సిన్, సాధారణ వైద్య ఆరోగ్య కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని పింఛన్ల పంపిణీలో తమకు మినహాయించేలా వెసులుబాటు కల్పించాలని గ్రామ సచివాలయ ఏఎన్ఎంలు ఎంపీడీఓ రహంతుల్లయ్యను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓతో సమావేశమైన ఏఎన్ఎంలు మాట్లాడుతూ.. ఆగస్టు 1న వృద్ధులకు బీసీజీ వాక్సిన్ వేయాల్సి ఉందని, ఇదే క్రమంలో పింఛన్లు కూడా పంపిణీ చేయడం, రెండు పనులు ఒకే రోజు చేసేందుకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఇదే క్రమంలో సీజనల్ వ్యాధులు పట్ల అందించే వైద్య సేవలను దృష్టిలో ఉంచుకుని పింఛన్ల పంపిణీ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఇది సాధ్యం కాని క్రమంలో పింఛన్ పంపిణీ చేసే ఒక్క రోజు వాక్సిన్ కార్యక్రమం నుంచి అయినా మినహాయింపు ఇవ్వాలని ఎంపీడీఓ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ ఏఎన్ఎంల సమస్యను ఉన్నతాధికారుల దృష్టి తీసుకుపోతానని తెలిపారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

పోరుమామిళ్ల : స్కీం వర్కర్లు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కాంట్రాక్టు వర్కర్లు, స్కీం వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ ఒత్తిడి తీసుకొని రాకూడదన్నారు. 42 రోజులుగా అంగన్వాడీలు ఉద్యమం చేస్తున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలన్నారు. ఆటో డ్రైవర్లకు ఫైనాన్స్ ఒత్తిడి తగ్గించాలన్నారు. సమావేశంలో పోరుమామిళ్ల మండల నూతన సీఐటీయూ కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కలసపాడు : స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా కీటక జనిత వ్యాధులపై విద్యార్థులకు మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డయేరియా, అంటు వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, చికున్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవని ఆయన పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దుర్గ, పాఠశాల హెచ్ఎం ప్రభావతి, ఏఎన్ఎం అరుణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 117 రద్దు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర నష్టం కలిగించే జీఓ 117ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ 117 అమలు వల్ల ప్రాథమిక పాఠశాల నుంచి 3, 4, 5 తరగతులను వేరు చేసి ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల వరకు కొనసాగించాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సయ్యద్ బాషా, జిల్లా కౌన్సిలర్లు రమణయ్య, రామసుధాకర్, ఖాజాపీరా, రామమునిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో విజయం సాధించాలి

పోరుమామిళ్ల : ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న భారత క్రీడాకారులకు పోరుమామిళ్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు శుక్రవారం ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులు వారి విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించి దేశ ప్రతిష్టను ఇనుమడింపచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహారెడ్డి, శివారెడ్డి, ఈశ్వరయ్య, వెంకట్రావు, రవిచంద్ర, సబిత, పర్విన్, గురమ్మ, శ్రీనివాసులు, మధుబాబు తదితరులు ఉన్నారు.

రెండిళ్లలో చోరీ

ఖాజీపేట : ఖాజీపేటలోని అగ్రహారంలో శుక్రవారం తెల్లవారుజామున రెండు చోరీలు జరిగాయి. గుండ్లకంట జయరాము ఇంటిలో చోరీ జరిగింది. ఇంటి వద్ద పంచలో నిద్రపోతుండగా దొంగలు ఇంటి వెనుక ఉన్న తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లి రూ. 26,200 నగదు, రెండు బంగారు చైన్లు, 2 జతల కమ్మలు, మాటీలు చోరీ చేశారు. కొత్త బట్టలు 10 జతలు ఎత్తుకుపోయారు. పక్కనే ఉన్న గుండ్లకంట చిన్నక్క ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంట్లో ఉన్న 10 జతల చీరలు, 10 వేల పింఛన్ డబ్బులు ఎత్తుకు పోయారు. చిన్నక్క తన కూతురు ఊరికి పోవడంతో మనవరాళ్లు ఒంటరిగా ఉంటారని తాళం వేసి గురువారం రాత్రి కూతురు ఇంటికి వెళ్లింది. ఇంటి వెనుక భాగం నుంచి వచ్చి చోరీ చేశారు. చోరీ జరిగిన ఇంటికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.